RNI: TELTEL12215
https://youtube.com/@PrabhathasuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu

# ప్రభాత సూర్యుడు

నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

RANGAREDDY, EDITION : 01, VOLUME :180 EDITOR: CHERUKU UPENDAR, DATE : WEDNESDAY 15 NOVEMBER 2023 PAGES:4 RATE: Rs.5/-

రంగారెడ్డి సంపుటి : 01 సంచిక : 180 ఎడిటర్ : చెరుకు ఉపేందర్ తేదీ : బుధవారం 15 నవంబర్ 2023 పేజీలు : 4 వెల : 5/-

## ఎడ్‌సెట్ ప్రత్యేక విడతలో 2,604 మందికి సీట్ల కేటాయింపు

-17 వరకు కాలేజీల్లో చేరేందుకు గడువు

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

రాష్ట్రంలో బీఎడ్ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన ఎడ్‌సెట్ ప్రత్యేక విడత కౌన్సెలింగ్‌లో 2,604 మంది అభ్యర్థులకు సీట్లు కేటాయించారు. ఈ మేరకు ఎడ్‌సెట్ ప్రవేశాల కన్వీనర్ పి రమేష్‌బాబు మంగళవారం ఒక

మిగతా 3లో

### ఆసుపత్రి కాంపౌండ్‌లోనే
## వందలాది మంది ఖననం



గాజా-విజయనేత్ర

గాజా నగరంలో అతిపెద్ద ఆసుపత్రి అల్ షిఫాపై ఇజ్రాయెల్ నిరంతరం దాడులు కొనసాగిస్తూనే ఉంది. మూడు రోజుల్లో ఆరుగురు నవజాత శిశువులతో సహా 32 మంది రోగులు ఇక్కడ మరణించారు. దాడి కారణంగా దాదాపు వంద మంది మృతదేహాలను ఆసుపత్రి సిబ్బంది పూడ్చిపెట్టలేకపోయారని గాజా ఆరోగ్యమంత్రిత్వశాఖ తెలిపింది. ఈ ఆసుపత్రిలో నీరు లేదు. కరెంటు లేదు అని ఆ ఆసుపత్రి చీఫ్ మొహమ్మద్ అబు సాల్మియా తెలిపారు. గాజాలోని 35 ఆసుపత్రుల్లో 23 పూర్తిగా మూతపడ్డాయి. అనేక ఆసుపత్రులలో, ఆరోగ్య కార్యకర్తలు మరియు రోగులను ఇజ్రాయెల్ సైన్యం లోపలికి మరియు బయటికి అనుమతించడం లేదని గాజా ఆరోగ్యమంత్రిత్వశాఖ నివేదించింది. గాజా నగరానికి పశ్చిమాన ఉన్న అల్-రిమాల్, తాల్ అల్-హవా, అల్-తుఫా, షేక్ అజ్లిన్ పరిసరాలు, బీచ్ శరణార్థి శిబిరంపై బాంబు దాడి జరిగింది. ఆర్మీ

మిగతా 2లో

### కాంగ్రెస్‌కు ఓటేస్తే
# దళారీల రాజ్యం





- ప్రజాస్వామ్యంలో ప్రజల ఒకే ఒక్క ఆయుధం ఓటు
- ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు
- పార్టీని కాదు పార్టీల చరిత్రను తెలుసుకోవాలి
- ఓటును చాలా జాగ్రత్తగా వినియోగించుకోవాలి
- మన భవిష్యత్తును మన తలరాతను మార్చేది మన ఓటు

ఇబ్రహీం పట్నం - ప్రభాత సూర్యుడు

ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారంలో భాగంగా కెసిఆర్ మంగళవారం సాయంత్రం ఇబ్రహీంపట్నం పరిధిలోని ఖానాపూర్ గేటు వద్ద ప్రజా ఆశీర్వాద బహిరంగ సభలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కల్వకుంట్ల చంద్రశేఖర రావు మాట్లాడుతూ 75 సంవత్సరాలు గడిచిన పూర్తిస్థాయిలో అభివృద్ధి జరగలేదని ఎన్నికలు వచ్చినాయ్ అంటే అన్ని పార్టీలు హడావిడిగా ఉంటాయి. పార్టీ

మిగతా 2లో

### ఎర్రచందనం వ్యాపారం
## ఇక చట్టబద్ధం

- ఆంక్షలు తొలగించిన కేంద్రం



న్యూఢిల్లీ -విజయనేత్ర

ఎర్రచందనం ఎగుమతులపై అమలులో ఉన్న ఆంక్షలను కేంద్ర ప్రభుత్వం ఎత్తివేసింది. దీంతో ఎర్ర చందనం ఎగుమతులకు సంబంధించి కన్వెన్షన్ ఆన్ ఇంటర్నేషనల్ ట్రేడ్ ఇన్ ఎన్‌డేంజర్డ్ స్పైసిస్ ఆఫ్ వైల్డ్ ఫానా అండ్ ఫ్లోరా (సీఐటీఈఎస్) 'ప్రతికూల' జాబితా నుంచి భారత్‌ను తొలగించారు. దీనివల్ల ఎర్ర చందనం వ్యాపారంలో రైతులు చట్టబద్ధంగానే ప్రవేశించవచ్చునని, మంచి ఆదాయం పొందవచ్చునని ప్రభుత్వం చెబుతోంది. సీఐటీఈఎస్ నిబంధనలను పాటించడం, దేశీయ చట్టాల్లో సవరణలు చేయడంతో ఈ

మిగతా 2లో

## కాంగ్రెస్ వస్తే.. ఆరు నెలలకో సీఎం ఖాయం

### మంత్రి కల్వకుంట్ల తారకరామారావు



**చిట్యాల- ప్రభాత సూర్యుడు:** కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీల పథకం ఆరునెలలకు ఒకసారి ముఖ్యమంత్రి మారే పథకమే తప్ప మరేమీ కాదని బీఆర్ఎస్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు, మంత్రి కల్వకుంట్ల తారక రామారావు అన్నారు. మంగళవారం నల్లగొండ జిల్లా నకిరేకల్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి చిరుమర్తి లింగయ్య గెలుపును కాంక్షిస్తూ చిట్యాల పట్టణ కేంద్రంలోని పాలసెంటర్ నుంచి కనకదుర్గమ్మ సెంటర్ వరకు రోడ్ షో నిర్వహించారు. అనంతరం అక్కడ నిర్వహిం చిన సభలో కేటీఆర్ మాట్లాడుతూ..

మిగతా 2లో

## బరిలో 2,898 మంది అభ్యర్థులు

- 119 నియోజకవర్గాలకు 4,798 నామినేషన్లు
- గజ్వేల్‌లో 114.. కామారెడ్డి బరిలో 58 మంది అభ్యర్థులు
- 608 నామినేషన్లు తిరస్కరణ
- నేటితో ముగియనున్న నామినేషన్ల ఉపసంహరణ గడువు



హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

నామినేషన్ల పరిశీలన అనంతరం శాసనసభ ఎన్నికల బరిలో 2,898 మంది అభ్య ర్థులు మిగిలారు. రాష్ట్రంలోని 119 అసెంబ్లీ నియోజకవర్గాలకు మొత్తం 4,798 నామినేషన్లు వేశారు. సోమవారం జరిగిన స్క్రూటినీలో వాటిలో 608 మంది అభ్యర్థుల

మిగతా 2లో

## అయిదేళ్ల చిన్నారి అత్యాచార కేసులో నిందితుడికి మరణశిక్ష



కొచ్చి - ప్రభాత సూర్యుడు

కేరళలోని అలువలో జరిగిన చిన్నారి కిడ్నాప్, అత్యాచారం కేసులో నిందితుడు అష్ఫక్ ఆలమ్‌కు ఎర్నాకుళం పోక్సో కోర్టు మంగళవారం (నవంబర్ 14) మరణశిక్షను విధించింది. ఈ కేసుకు సంబంధించి ప్రాసిక్యూషన్ వాదనల అనంతరం జడ్జి కే సోమన్ ఈరోజు తీర్పును వెల్లడించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి సోమన్ ఈ కేసు గురించి మాట్లాడుతూ.. 'ప్రాసిక్యూషన్ చేసిన వాదనలను కోర్టు అంగీకరించింది. ఇది అత్యంత అరుదైన కేసు. ఈ కేసులో నిందితుడికి ఎలాంటి క్షమాపణ అవసరం లేదు. ఇలాంటి నిందితుడు సమాజానికే సమస్య.' అని అన్నారు. దాదాపు 110 రోజుల పాటు ఈ కేసులో సుదీర్ఘ వాదనలు జరిగిన అనంతరం బాలల దినోత్సవం రోజునే తీర్పు వెలువడడం గమనార్హం. ఈ కేసులో నిందితుడు అష్ఫక్ ఆధారాలు ధ్వంసం చేసినందుకు కోర్టు ఐదేళ్ల జైలు శిక్ష విధించింది. అలాగే మైనర్‌కు డ్రగ్స్ ఇచ్చినందుకు మూడేళ్ల శిక్ష, మైనర్‌ను రేప్

మిగతా 2లో

### కేసీఆర్ అధికారంలో ఉంటే..
# ఉద్యోగాల్లేవ..!

వరంగల్-- ప్రభాత సూర్యుడు



మార్పు కావాలంటే కాంగ్రెస్ అధికారంలోకి రావాలని, తెలంగాణ పాపాల భైరవుడు కేసీఆర్ వంద తప్పులు పూర్తయ్యాయని, ఇక శిరచ్ఛేదనం జరగాలని, బీఆర్ఎస్ నేలకూలి.. ఇందిరమ్మ రాజ్యం రావాలని టీపీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డి తెలిపారు. సీఎం కేసీఆర్ కుటుంబం అధికారంలో ఉన్నన్ని రోజులు రాష్ట్రంలో నిరుద్యోగులకు ఉద్యోగాలు రావని, ఈ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపించకుంటే 30 లక్షలమంది నిరుద్యోగ యువకులు అడవిబాట పట్టే పరిస్థితి వస్తుందని హెచ్చరించారు. మంగళ వారం జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్, వరంగల్ జిల్లా వర్ధన్నపేట, కామారెడ్డి జిల్లా కామారెడ్డి నియోజకవర్గాల్లో నిర్వహించిన బహిరంగ సభల్లో రేవంత్‌రెడ్డి పాల్గొన్నారు. జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గ కేంద్రంలో నిర్వహించిన సభలో రేవంత్ మాట్లాడుతూ.. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపించకుంటే 30 లక్షలమంది నిరుద్యోగ యువకులు అడవిబాట పట్టే పరిస్థితి వస్తుందని హెచ్చరించారు. తల్లిదండ్రులపై భారం మోపలేక పట్టణాల్లో విద్యార్థులు చనిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 2004 వైఎస్సార్ హయాంలో రూ.12వేల కోట్లతో రైతు కరెంటు బకాయిల రద్దు, 9 గంటల కరెంటు, ఫీజు రీయింబర్స్‌మెంట్ అందించిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనని గుర్తుచేశారు. రాబోయే

మిగతా 2లో

## అయిదేళ్ల చిన్నారి అత్యాచార కేసులో నిందితుడికి మరణశిక్ష

(మొదటి పేజీ తరువాయి)

చేసినందుకు జీవితకాల జైలుశిక్ష, మర్డర్ చేసినందుకు మరణశిక్షను విధిస్తున్నట్లు కోర్టు చెప్పింది. ఈ కేసులో 7,70,000 జరిమానా చెల్లించాలని నిందితుడికి కోర్టు ఆదేశాలు జారీ చేసింది.

**బాలల దినోత్సవం రోజు తీర్పు.. పిల్లలపై అత్యాచారాలకు పాల్పడే వారికి గట్టి హెచ్చరిక: విజయన్**

తిరువనంతపురం అలువాలో బాలిక హత్య కేసులో కోర్టు ప్రకటించిన తీర్పు నేరాలకు పాల్పడే వారికి గట్టి హెచ్చరిక అని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి పినరయి విజయన్ అన్నారు. సమాజాన్ని దిగ్భ్రాంతికి గురిచేసే దారుణమైన క్రూరత్వానికి చిన్నారి బలి అయ్యిందని, బాలల దినోత్సవం రోజునే వచ్చిన ఈ తీర్పు చిన్నారులను అఘాయిత్యాలకు బలిపశువులను చేసే వారికి గట్టి హెచ్చరిక అని ముఖ్యమంత్రి అన్నారు. సమగ్ర విచారణ ద్వారా దోషికి గరిష్టంగా శిక్ష పడేలా చేసిన దర్యాప్తు బృందాన్ని, ప్రాసిక్యూషన్‌ను ఈ సందర్భంగా ముఖ్యమంత్రి అభినందించారు.

దారుణానికి గురైన చిన్నారి కుటుంబానికి ప్రభుత్వం అన్ని రకాల సహాయం, రక్షణ కల్పిస్తుంది. వారికి జరిగిన నష్టాన్ని ఏదీ భర్తీ చేయదు. అయితే కోర్టు తీర్పుతో న్యాయం జరిగింది. నాగరిక సమాజంలో పిల్లలపై ఎలాంటి హింసాకాండ ఆమోదయోగ్యం కాదు. అలాంటి వారిపై కనికరం లేకుండా చర్యలు తీసుకుంటామని విజయన్ అన్నారు. ఇలాంటి అమానవీయ నేరాలకు పాల్పడే వారికి ఈ కోర్టు తీర్పు గట్టి హెచ్చరిక కూడా. ఇలాంటి నేరస్తులను ఏకాకిని చేసేందుకు సమాజం అంతా సిద్ధం కావాలని ముఖ్యమంత్రి అన్నారు.

## బరిలో 2,898 మంది అభ్యర్థులు

(మొదటి పేజీ తరువాయి)

నామినేషన్లను అధికారులు తిరస్కరించారు. పరిశీలన అనంతరం మిగిలిన 2,898 మంది అభ్యర్థులు పోటీలో నిలిచారు. అత్యధికంగా గజ్వేల్‌లో 114 మంది అభ్యర్థులు ఎన్నికల బరిలో ఉన్నారు. మేడ్చల్‌లో 67, కామారెడ్డిలో 58 మంది, ఎల్బీనగర్‌లో 50 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. కొడంగల్‌లో 15 మంది అభ్యర్థులు పోటీలో ఉండగా.. అత్యల్పంగా నారాయణపేటలో కేవలం ఏడుగురు అభ్యర్థులు, బాల్కొండ బరిలో తొమ్మిది మంది ఎన్నికల బరిలో ఉన్నారు. నామినేషన్ల ఉపసంహరణకు బుధవారం మధ్యాహ్నం వరకు గడువు ఉంది.

## ఎర్రచందనం వ్యాపారం ఇక చట్టబద్ధం

(మొదటి పేజీ తరువాయి)

వెసులుబాటు లభించిందని తెలిపింది. ఎర్ర చందనాన్ని ఫర్నీచర్, హస్తకళలకు సంబంధించిన వస్తువుల తయారీకి ఉపయోగిస్తారు. జౌళి, మందుల తయారీ పరిశ్రమల్లో కూడా దీనిని వాడతారు. గతంలో ఎర్ర చందనం అక్రమ రవాణాపై పలు ఉదంతాలు వెలుగు చూడడంతో సీఐటీఈఎస్ భారత్‌ను 'ప్రతికూల' దేశాల జాబితాలో చేర్చింది. గణనీయ వాణిజ్య సమీక్ష (ఆర్ఎస్‌టీ) నుంచి తొలగించింది. 2004 నుంచి ఇది కొనసాగుతోంది. నిబంధనలు పాటించని దేశాలపై క్రమశిక్షణ చర్యలు తీసుకునే అవకాశం ఈ జాబితా ద్వారా సీఐటీఈఎస్‌కు దఖలు పడింది. గతంలో మన దేశం కూడా వ్యాపార సస్పెన్షన్‌కు గురైంది. ఆంధ్రప్రదేశ్‌లోని కొన్ని జిల్లాల్లో ఎర్ర చందనం చెట్లను పెంచుతున్నారు. ఇప్పుడు లభించిన వెసులుబాటుతో దాని పెంపకందారులు చట్టబద్ధంగానే వ్యాపారం చేసుకోవచ్చు. ఎర్ర చందనాన్ని ఇప్పటి వరకూ చాలా మంది అక్రమంగానే సాగు చేస్తున్నారు. చెట్లు పెరిగిన తర్వాత వాటిని కొట్టేసి దొంగచాటుగా రవాణా చేస్తూ పెద్ద మొత్తంలో సొమ్ము ఆర్జిస్తున్నారు. దీనివల్ల సహజ అడవులు అంతరించిపోతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో కేంద్రం తీసుకున్న నిర్ణయంపై పర్యావరణ వేత్తలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

## ఆసుపత్రి కాంపౌండ్‌లోనే వందలాది మంది ఖననం

(మొదటి పేజీ తరువాయి)

ట్యాంకులు ఉంచినందున అంబులెన్స్‌లు అక్కడికి చేరుకోలేవు. నుసెరత్ శరణార్థుల శిబిరంపై జరిగిన దాడిలో ఏడుగురు చనిపోయారు. ఐక్యరాజ్యసమితి పాఠశాలపై దాడి జరిగింది. గాజాలో ఇప్పటివరకు 11,360 మందికి పైగా మరణించినట్లు సమాచారం. అయితే కమ్యూనికేషన్ వ్యవస్థ దెబ్బతి నడంతో కచ్చితమైన సమాచారం లభించడం లేదు. అల్ షిఫా హాస్పిటల్ సామూహిక సమాధిగా మారిందని మంగళవారం ఆ ఆసుపత్రి చీఫ్ మొహమ్మద్ అబు సాల్మియా ఆవేదన వ్యక్తం చేశారు. ఎంతోమందికి ప్రాణాలు పోయాల్సిన ఆసుపత్రి ఇజ్రాయెల్ సైన్యం దిగ్బంధించడం వల్ల నేడు సమాధిగా మారిందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. చిన్నారులతో సహా దాదాపు 179 మందిని ఈ ఆసుపత్రి కాంపౌండ్‌లోనే ఖననం చేసినట్లు మంగళవారం ఆయన తెలిపారు. వైద్య సౌకర్యాల లేమితో వందలాది మంది ప్రాణాలు కోల్పోతున్నారని ఆయన నొక్కి చెప్పారు. ఈ సందర్భంగా అబు సాల్మియా మాట్లాడుతూ.. 'ఈ ఆసుపత్రిలో చనిపో యిన వారిని ఈ ఆసుపత్రి కాంపౌండ్‌లోనే సామూ హికంగా ఖననం చేయాల్సి వచ్చింది. ఆసు పత్రిలో ఇంధన సరఫరా ఆగిపోవడంతో ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌లోని ఏడుగురు శిశువులు, 29 మంది పెద్దలు చనిపోయారు. వారిని ఆసుపత్రిలోనే ఖననం చేశాము' అని అన్నారు. ఇంకా మరికొన్ని మృతదేహాలు ఆసుపత్రి కాంప్లెక్స్‌లో పడి ఉన్నాయి. ప్రస్తుతం కరెంటు లేదని ఆయన అన్నారు. ఇక ఈ ఘటనపై ఫ్రెంచ్ అంత ర్జాతీయ వార్తాసంస్థ ఎఎఫ్‌పికి చెందిన జర్నలిస్టు మాట్లాడుతూ.. 'కుళ్లిన మృతదేహాల నుంచి తీవ్రమైన దుర్వాసన వస్తుంది' అని అన్నారు. ఈ ఆసుపత్రిలో ఆపరేషన్స్ చేసే వైద్యులు ఈ ఘటన అమానవీయం అని పేర్కొన్నారు. ఆది, సోమవారాల్లో వరుసగా 39 మంది, 36 మంది శిశువులు మృతి చెందినట్లు పీడియాట్రిక్ హెడ్ డాక్టర్ మొహమ్మద్ తబాషా సోమవారం మీడి యాకు తెలిపారు.

# కాంగ్రెస్‌కు ఓటేస్తే దళారీల రాజ్యం

(మొదటి పేజీ తరువాయి)

గుణగణాలు తెలుసుకొని ఆయనకు అవకాశం ఇస్తే ఎలా పని చేస్తాడు ఎటువంటి వాడు వ్యక్తిని తప్పకుండా తెలుసుకోవాలి. ఆలోచన చేయాలి పార్టీల విషయంలో పదిమందితో ప్రతి గ్రామంలో చర్చించాలి. ప్రజాస్వామ్యంలో ప్రజలకు ఉండేది ఒకే ఒక ఆయుధం మీ సొంత ఓటు. ఏ వ్యక్తి గెలిచిన ఏ గవర్నమెంట్ వచ్చిన ఆ చేతుల్లో ఆ రాష్ట్రంలో ఉంటుంది .పదిలంగా ఉంటుంది. ఓటు చాలా జాగ్రత్తగా వినియోగించుకోవాలి రాబోయే ఐదు సంవత్సరాలు మన భవిష్యత్తు మన తలరాతను మారుస్తుంది. ఓటు అటు ఇటు ఇస్తే గందరగోళంగా అవుతుంది. భారతదేశంలో ప్రజాస్వామ్య ప్రక్రియలు అవగాహన అవసరం. 10 మంది లో ప్రతి గ్రామంలో చర్చ పెట్టాలి నిజా నిజాలను అందరూ కలిసికట్టుగా నిర్ణయం తీసుకోవాలి. పార్టీ చరిత్ర చూడాలి. బిఆర్ఎస్ పార్టీ పుట్టింది తెలంగాణ కోసమేనని ఎన్ని సమస్యలు చూసాము తెలంగాణ వచ్చిన తర్వాత నాలుగు నెలలు కష్టపడి ఒక ప్రణాళిక బద్ధంగా తెలంగాణను అభివృద్ధి చేశాం .వృద్ధులు, వితంతువులు, వికలాంగులు, పెన్షన్ కాంగ్రెస్ హయంలో వందల రూపాయలు ఉంటే దానిని వేలలోకి మార్చిన ఘనత దేశంలో బిఆర్ఎస్ పార్టీకే దక్కిందని తెలిపారు. రాష్ట్రంలో 1018 గురుకుల కళాశాలలో ఏర్పాటు చేశామని మీరు ఖాన్ పేట గ్రామంలో మెడికల్ కాలేజీలు వచ్చినాయి. విద్యుత్తు వాడుకకు 1100 యూనిట్ల నుండి 2200 యూనిట్లకు పెంచడం జరిగింది. ఇబ్రహీంపట్నం చెరువులోకి నీరు రావాలని 36 కిలోమీటర్లు నాలను అభివృద్ధి చేసి చెరువులోకి నీరు వచ్చింది. శివన్నగూడ నుండి లక్ష ఎకరాలకు రైతులకు నీరు అందించడం జరుగుతుంది. ధరణి పోర్టల్ రావడంతో రైతులకు భూముల మీద అధికారం రైతుబంధు ద్వారా రానున్న రోజులలో 16 వేల రూపాయలు ఎకరాకు అందించడం జరుగుతుంది. కంటి వెలుగు ద్వారా రాష్ట్రంలో మూడు కోట్ల మందికి పరీక్షలు చేసి 80 లక్షల మంది కి కంటి అద్దాలు ఇవ్వడం జరిగింది. నియోజకవర్గ పరిధిలోని ఫాక్స్ ఖాన్ కంపెనీ ద్వారా నిరుద్యోగులకు లక్ష మందికి ఉద్యోగాలు, దళిత బంధు ద్వారా నియోజకవర్గానికి ప్రథమ పాత్ర ఉంటుందని అన్నారు. మంచిరెడ్డి కిషన్ రెడ్డి ని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని నియోజకవర్గ ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీ కేశవరావు, మాజీ స్పీకర్ మధుసూదనా చారి, విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి, జెడ్పి చైర్ పర్సన్ తీగల అనిత రెడ్డి, బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు క్యామ మల్లేష్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు వెంకట రమణారెడ్డి, రాష్ట్ర నాయకులు మంచిరెడ్డి ప్రశాంత్ రెడ్డి (బంటి) మార్కెట్ కమిటీ చైర్మన్ ఏర్పుల చంద్రయ్య, ఎంపీపీ కృపేష్, నర్మద, మున్సిపల్ వైస్ చైర్మన్ ఆకుల యాదగిరి, బిఆర్ఎస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విచక్షణతో ఓటు వేయండి.. లేదంటే రాష్ట్రం ఆగమైతది

ఎవరెన్ని కుట్రలు పన్నినా.. ఎన్ని జిమ్మిక్కులు చేసినా.. మన గెలుపును ఆపలేరని, బీఆర్ఎస్ ప్రభుత్వం చేస్తున్న సంక్షేమం, అభివృద్ధి పనులపై గ్రామగ్రామాన వాడవాడన చర్చ జరగాలని బీఆర్ఎస్ అధినేత, సీఎం కల్వకుంట్ల చంద్రశేఖర రావు అన్నారు. బీఆర్ఎస్ కార్యకర్తలు అభివద్ధి, సంక్షేమంపై చర్చ జరిపి ప్రజలను చైతన్యవంతులను చేయాలని సూచించారు. 50 ఏండ్ల పాటు కాంగ్రెస్ చేతికి అధికారం ఇస్తే ఏం చేశారో మనందరికీ తెలుసని, ఇప్పుడు మళ్లీ వాళ్లకు ఓటేస్తే దళారీల రాజ్యం వస్తదని, రాష్ట్రం మళ్లీ వెనక్కి పోతదని తెలిపారు. అందుకే, ఓటు వేసేటప్పుడు ఒక్కసారి ఆలోచించుకొని, అభ్యర్థి ఎలాంటి వాడో.. అతని వెనకాల ఉన్న పార్టీ చరిత్ర ఏమిటో తెలుసుకొని మంచి నాయకున్ని ఎన్నుకోవాలని కోరారు. మంగళవారం నల్లగొండ జిల్లా నాగార్జున సాగర్, జనగామ జిల్లా పాలకుర్తి, రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభల్లో సీఎం కేసీఆర్ పాల్గొన్నారు.

దేశంలో ఎక్కడాలేని పథకాలు రాష్ట్రంలో అమలు

నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్ నియోజక వర్గంలోని అనుములలో జరిగిన సభలో సీఎం మాట్లాడుతూ.. రైతులకు పెట్టుబడి సాయం, నాణ్యమైన 24 గంటలు ఉచిత కరెంటు, రైతు బంధు, రైతుబీమా పథకం, ధరణి పోర్టల్, మిషన్ భగీరథ నీళ్లు, ఆసరా పింఛన్లు, కేసీఆర్ కిట్టు, కంటి వెలుగు లాంటి పథకాలు దేశంలో ఎక్కడా లేనివిధంగా తెలంగాణలో అమలు చేస్తున్నామని చెప్పారు. కాంగ్రెస్ వాళ్లకు ఓటేస్తే మూడు గంటల కరెంట్ మాత్రమే వస్తదని, రైతు బంధు, రైతు బీమా, ధరణి పోర్టల్ మాయమై.. మళ్లీ దళారీల రాజ్యం వస్తుందని తెలిపారు. ప్రజల సొమ్ము దుబారా చేస్తున్నానని ఉత్తమ్‌కుమార్ రెడ్డి అంటున్నారని, రైతులకు మూడు గంటలు విద్యుత్ సరిపోతుందని రేవంత్ రెడ్డి చెప్తున్నాడని, కర్నాటక ఉప ముఖ్య మంత్రి ఆ రాష్ట్రంలో ఐదు గంటల ఉచిత విద్యుత్ అందిస్తున్నామని గొప్పలు చెప్పుకుంటు న్నారని.. అలాంటివారు తెలంగాణకు అవసరమా అని ప్రశ్నించారు. 2014లో తెలంగాణలో బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చినప్పుడు.. వ్యవసాయానికి 24 గంటలు ఉచిత విద్యుత్ అందిస్తానని అసెంబ్లీలో ప్రకటన చేశానని, అప్పుడు సీఎల్పీ నేతగా ఉన్న జానారెడ్డి అది సాధ్యం కాదని ఎద్దేవా చేశారని, చేసి చూపిస్తానని సవాల్ విసిరితే ఉచిత కరెంటు ఇస్తే కాంగ్రెస్ కండువాను వదిలేసి గులాబీ కండువా కప్పుకుంటానని జానారెడ్డి సభ సాక్షిగా చెప్పారని గుర్తుచేశారు. అష్ట కష్టాలు పడి సంవత్సరం లోపే వ్యవసాయానికి 24 గంటలు ఉచిత కరెంటు ఇస్తే జానారెడ్డి కండువా మార్చకుండా మాట తప్పారని విమర్శించారు. ఇక్కడ కమ్యూనిస్టు యోధుడు చాలా కాలం ప్రజల కోసం పనిచేసిన నాయకుడు నోముల నరసింహయ్య చేతిలో జానారెడ్డి ఓడిపోయారని, నరసింహయ్య అకాల మరణంతో ఉప ఎన్నిక వస్తే ఆయన కొడుకు భగత్ చేతిలో మళ్లీ ఓడిపోయారని గుర్తు చేశారు. అలాంటి వారి మాటలను నమ్మొద్దని, నోముల భగత్‌ను గెలిపిస్తే తానే నియోజకవర్గాన్ని అభివద్ధి చేసి చూపిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీ కె.కేశవ రావు, బడుగుల లింగయ్య యాదవ్, ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి నోముల భగత్ కుమార్ యాదవ్, ట్రైకా చైర్మెన్ రామచంద్రనాయక్, తదితరులు పాల్గొన్నారు.

# కేసీఆర్ అధికారంలో ఉంటే ఉద్యోగాల్లేవ్..!

(మొదటి పేజీ తరువాయి)

ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకొచ్చిన వెంటనే ఇచ్చిన 6 గ్యారెంటీ హామీలు అమలు చేస్తామని స్పష్టంచేశారు. అలాగే, స్టేషన్ ఘన్‌పూర్‌లోరి వంద పడకల ఆస్పత్రి, డిగ్రీ కళాశాల నెలకొల్పే బాధ్యత తనదేనని హామీ ఇచ్చారు. నిరుద్యోగం, రైతు ఆత్మహత్యలు, కరువు, ఆడబిడ్డలపై అత్యాచారాల్లో మొదటి స్థానం తప్ప, ఏ విషయంలో రాష్ట్రం అభివృద్ధి సాధించిందో కేసీఆర్ చెప్పాలని ప్రశ్నించారు. సీఎం అయిన తర్వాత ఏడాదికి 1800 బార్లు, 3000 వైన్ షాపులు, 62వేల బెల్టు షాపులు తెరిచి, రూ.36 వేల కోట్ల ప్రజల ఆస్తులను కొల్లగొట్టిన నాయకుడు.. దేశంలో ఏక్కడా లేడన్నారు. ఎర్రబెల్లి దయాకరరావు పంచాయతీ శాఖ మంత్రిగా ఉన్నా.. గ్రామాల్లో బిల్లులు రాక సర్పంచులు ఆత్మహత్యలు చేసుకుంటుంటే ఖాళీ సీసాలు అమ్ముకుని బతుకమని చెపుతున్న అసమర్థుడని తెలిపారు. స్టేషన్ ఘనపూర్ భవిష్యత్తు, అభివృద్ధి ఇక్కడి ప్రజల చేతుల్లోనే ఉందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ నియోజక వర్గ అభ్యర్థి సింగపురం ఇందిరను గెలిపించాలని పిలుపునిచ్చారు. సభలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి అద్దంకి దయాకర్, రాష్ట్ర అబ్జర్వర్ శోభారాణి, మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్య, ఉపాధ్యక్షులు జగదీష్ రెడ్డి, సుభాష్ రెడ్డి, కేశిరెడ్డి లక్ష్మారెడ్డి, లింగాజీ, చేపూరి చిరంజీవి, అనిల్, దిలీప్ రెడ్డి, మండలాల అధ్యక్షులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

ప్రజలు కాంగ్రెస్‌ను కోరుకుంటున్నారు

వరంగల్ జిల్లా వర్ధన్నపేటలోని మామునూరు లక్ష్మీపురం వద్ద జరిగిన సభలో రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రాన్ని కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు, కవిత దోచుకు న్నారన్నారు. మేడిగడ్డ ప్రాజెక్టు పేరుతో లక్షల కోట్ల రూపాయలు కేసీఆర్ కుటుంబం మింగిందని ఆరోపించారు. కుంగిన మేడిగడ్డ బ్యారేజ్‌ను చూడటానికి వెళితే అక్కడి వరకు పోకుండా పోలీసులను పెట్టి అడ్డుకున్నారన్నారు.

గజ్వేల్‌లో కేసీఆర్.. వెయ్యి ఎకరాల్లో, కేటీఆర్ 100 ఎకరాల్లో గడీలు నిర్మించుకున్నారని, కానీ నిరుద్యోగులకు ఉద్యోగాలు మాత్రం ఇవ్వలేదని విమర్శించారు. ఆరూరి రమేష్ లాండ్ పులింగ్ పేరుతో తమ భూములను లాక్కోవద్దని పేదలు నిరసన తెలిపితే పోలీస్ బుట్లతో తొక్కించారని తెలిపారు. ఆ జీవో ఇంకా రద్దు కాలేదన్నారు. పేదలందరూ కాంగ్రెస్‌ను కోరుకుం టున్నారని, తాము అధికారంలోకి రాగానే ఆరు గ్యారెంటీ పథకాలు అమలు చేస్తామని భరోసా ఇచ్చారు. వర్ధన్నపేట నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి కేఆర్ నాగరాజు, నర్సంపేట నియోజకవర్గ అభ్యర్థి దొంతి మాధవరెడ్డి, హన్మకొండ నియోజకవర్గం అభ్యర్థి రాజేందర్ రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు వరద రాజేశ్వర్ రావు, హన్మకొండ నియోజక వర్గం కాంగ్రెస్ అభ్యర్థి నాయిని రాజేందర్ రెడ్డి, నర్సంపేట నియోజకవర్గ అభ్యర్థి దొంతి మాధవరెడ్డి, సీపీఐ జిల్లా కార్యదర్శి మేకల రవి తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ అధికారంలో ఉంటే ఉద్యోగాలు రావు

కామారెడ్డి జిల్లా రామారెడ్డి మండలం రెడ్డిపేటలో నిర్వహించిన సభలో రేవంత్ మాట్లా డుతూ.. సీఎం కేసీఆర్ కుటుంబం అధికారంలో ఉన్నన్ని రోజులు రాష్ట్రంలో నిరుద్యోగులకు ఉద్యోగా లు రావని అన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో ఉద్యోగాలు వస్తలేవని, తెలంగాణ రాష్ట్రం వస్తే లక్షల ఉద్యోగాలు వస్తాయని, జీవితాలు బాగుపడతా యని ఆశపడ్డ యువతకు నిరాశే మిగిలిందన్నారు. నిరుద్యోగులు 'నిరుద్యోగ గోస' బ్యానర్ పట్టు కున్నారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవాలని కోరారు. తల్లిదండ్రులు ఖాళీ కడుపుతో రెక్కల కష్టం చేసి పిల్లలను చదివిస్తే.. ప్రభుత్వం పరీక్షా పత్రాలు అమ్ముకుందని, దాంతో నిరుద్యోగు లు ఉద్యోగం రాక, ఊర్లో ముఖం చూపించక ఉరేసుకుని చస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే, రైతుల ఆత్మహత్యలూ ఆగలేదని, రామా రెడ్డికి చెందిన లింబయ్య పంట నష్టపోయి పట్నం లో బతకలేక ట్యాంక్ బండ్‌పై ఉరేసుకున్నాడని, ధాన్యం కుప్పపై చలికి, వానకు గుండె ఆగిపోయి బీరయ్య అనే రైతు చనిపోయాడని గుర్తుచేశారు. ఆ బాధిత కుటుంబాలను సీఎం, ఎమ్మెల్యేలు పరామ ర్శించిన పాపాన పోలేదన్నారు. మాస్టర్ ప్లాన్‌తో భూములు గుంజుకు నేందుకు కేసీఆర్ కామారెడ్డికి వస్తున్నాడని స్పష్టం చేశారు. అడవిలో పులి ఊర్లలో మనుషులను, పెంపుడు జంతువులను తినడానికి వస్తే.. పక్క ఊరి నుంచి తనను వేటగాడిగా అధిష్టానం పంపిందని, కేసీఆర్‌ను వెంటాడి కామారెడ్డి ప్రజలకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీ పథకాలను వివరించారు. ఈ సభ సందర్భంగా మండలంలోని బట్టు తాండ సర్పంచ్ రెడ్డినాయక్ బీఆర్ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మహమ్మద్ షబ్బీర్ అలీ, అరికెల నర్సారెడ్డి, అద్దంకి దయాకర్, యూసుఫ్ అలీ, జిల్లా పరిషత్ ఫ్లోర్ లీడర్ నారెడ్డి మోహన్‌రెడ్డి, చంద్రకాంత్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ వస్తే.. ఆరు నెలలకో సీఎం ఖాయం

(మొదటి పేజీ తరువాయి)

కేసీఆర్ మూడోసారి ముఖ్యమంత్రి కావాలంటే నకిరేకల్ నియోజకవర్గంలో కారు గుర్తుకు ఓటేసి బీఆర్ఎస్ అభ్యర్థి చిరుమర్తి లింగయ్యను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ పరిపాలనలో నల్లగొండ జిల్లాను అభివృద్ధి చేయలేదని, అలాంటి పార్టీకి ఓటు అడిగే నైతిక హక్కు లేదన్నారు. కేసీఆర్ మూడవ సారి ముఖ్యమంత్రి అయితే ప్రతి తెల్ల రేషన్ కార్డు ఉన్న వ్యక్తికి కేసీఆర్ బీమా వర్తింపజేస్తామని తెలిపారు. కేసీఆర్ పాలనలో తెలంగాణలోనే నల్గొండ జిల్లా అత్యధికంగా వరి పండించే జిల్లాగా అభివృద్ధి చెందిందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం తిరిగి అధికారంలోకి వస్తే సౌభాగ్య లక్ష్మి పథకం కింద 18 ఏండ్లు నిండిన ప్రతి యువతికీ వివాహం జరిగేంత వరకు నెలకు రూ.3వేల భృతి ఇస్తామని, తెల్ల రేషన్ కార్డు ఉన్నోళ్లందరికీ రూ.400 గ్యాస్ సిలిండర్, రైతుబంధు ఎకరానికి రూ.10వేల నుంచి రూ.16 వేలకు పెంచుతామని చెప్పారు. నకిరేకల్ నియోజక వర్గంలో 42,862 మందికి ఆసరా పెన్షన్లు ఇస్తున్నామని, 10,450 మందికి కల్యాణలక్ష్మి ఇచ్చామని, రైతు వేదిక, శ్మశానవాటికలు, నకిరేకల్ పట్టణంలో రూ.32 కోట్లతో వంద పడకల ఆస్పత్రి నిర్మాణం చేస్తున్నామని తెలిపారు. రానున్న రోజుల్లో చిట్యాల పట్టణంలో ఫ్లై ఓవర్ బ్రిడ్జి, పాలిటెక్నిక్ కళాశాలను ఏర్పాటు చేస్తామన్నారు. వెలిమినేడ్ ప్రాంతంలో ఇండస్ట్రియల్ పార్కును ఏర్పాటు చేసి ఉద్యోగాలు కల్పిస్తామని తెలిపారు. కోమటిరెడ్డి బ్రదర్స్‌కు డబ్బు పిచ్చి పట్టిందని అన్నారు. ఒక్క కేసీఆర్‌ను ఓడించడానికి దేశంలోని ప్రధానమంత్రి మోడీ, అమిత్ షా, ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులు, సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, డీకే శివకుమార్ లాంటి నాయకులు సంక్రాంతి పండుగకు వచ్చే గంగిరెద్దుల్లా వస్తున్నారని, ఇలాంటివారిని తెలంగాణ ప్రజలు నమ్మరని అన్నారు. బీఆర్ఎస్ నకిరేకల్ ఎమ్మెల్యే అభ్యర్థి చిరుమర్తి లింగయ్య మాట్లాడుతూ.. మంత్రి కేటీఆర్ సహకారంతో చిట్యాల పట్టణంలో రూ.39 కోట్లతో అభివృద్ధి పనులు, ఉదయ సముద్రం ప్రాజెక్టు పనులను పూర్తి చేసుకున్నామని తెలిపారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు బడుగుల లింగయ్య యాదవ్, నల్లగొండ శాసనసభ్యులు కంచర్ల భూపాల్ రెడ్డి, గుత్తా వెంకట్ రెడ్డి మెమోరియల్ చైర్మెన్ గుత్తా అమిత్ రెడ్డి, చిట్యాల మార్కెట్ కమిటీ చైర్మెన్ జడల ఆది మల్లయ్య, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఎడ్‌సెట్ ప్రత్యేక విడతలో 2,604 మందికి సీట్ల కేటాయింపు

(మొదటిపేజీ తరువాయి)

ప్రకటన విడుదల చేశారు. 3,988 మంది అభ్యర్థులు వెబ్ఆప్షన్లను నమోదు చేశారని వివరించారు. కన్వీనర్ కోటాలో 6,419 బీఎడ్ సీట్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. బుధవారం నుంచి ఈనెల 17 వరకు కేటాయించిన కాలేజీల్లో అభ్యర్థులు ఫీజు చెల్లించి ధ్రువపత్రాలను సమర్పించి చేరాలని కోరారు. బీఎడ్‌లో ఇంకా 3,815 సీట్లు మిగిలిపోయాయని పేర్కొన్నారు. మొదటి విడతలో 14,267 సీట్లుంటే 9,417 మందికి సీట్లు కేటాయించామనీ, వారిలో 4,674 మంది కాలేజీల్లో రిపోర్టు చేశారని వివరించారు. రెండో విడతలో 9,593 సీట్లకుగాను 6,223 మందికి సీట్లు కేటాయించామని తెలిపారు. వారిలో 3,578 మంది కాలేజీల్లో చేరారని పేర్కొన్నారు.

# నీలోఫర్ కేఫ్‌లో మంత్రి కేటీఆర్ సందడి

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

ఎన్నికల ప్రచారంలో, అధికారిక కార్యక్రమాలతో బిజీబిజీగా ఉండే రాష్ట్ర మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు హైదరా బాద్‌లోని నీలోఫర్ కేఫ్‌లో మంగళ వారం సందడి చేశారు. ఆయన ఓ మీడియా సంస్థకు ఇంటర్వ్యూ ఇచ్చేందుకు అక్కడకు వెళ్లారు. కేఫ్‌లోని పలువురి దగ్గరకెళ్లి పలుకరిం చారు. మంత్రి కేటీఆర్‌తో మాట్లాడే సమయం లో.. హైదరాబాద్‌లో శాంతిభద్రతలు బాగున్నాయనీ, అభివృద్ధి వేగంగా జరుగుతున్నదని బెంగుళూరులో పనిచేస్తున్న ఓ యువకుడు ప్రశంసించాడు. పదేండ్ల లో అద్భుతంగా మార్పు చెందిందనీ, హైదరాబాద్‌కు వచ్చిన ప్రతిసారీ వినూత్నంగా కనిపిస్తున్నదని కొనియా డారు. దశాబ్దాల కిందట వారణాసి వచ్చి స్థిరపడిన ఓ వ్యక్తి మాట్లాడు తూ.. కులమత, ప్రాంతాలక తీతంగా అందరూ కలిసి జీవించే ప్రశాంత వాతావరణం హైదరాబాద్‌లో ఉందని చెప్పారు. పలువురు మహిళల తో మంత్రి కేటీఆర్ సంభాషించారు. ఆ సందర్భంగా మంత్రి కేటీఆర్ వారి కుటుంబ నేపథ్యం, ప్రభుత్వ పనితీరు పట్ల అభిప్రాయాలను అడిగి తెలుసు కున్నారు. ఓ సాధారణ వ్యక్తిలాగా చారు తాగుతూ మంత్రి కేటీఆర్ మాట్లాడటం అందర్నీ ఆకట్టుకున్నది. ఈ సందర్భంగా కేటీఆర్‌తో పలువురు సెల్ఫీలు తీసుకున్నారు.

# ఉప ఎన్నికల హామీలపై బీజేపీకి నిరసన

## ఎమ్మెల్యే రఘునందన్‌రావును నిలదీసిన యువత



చేగుంట - ప్రభాత సూర్యుడు: మెదక్ జిల్లా చేగుంట మండలం రుక్మాపూర్ గ్రామంలో బీజేపీ ఎమ్మెల్యే మాధవనేని రఘునందన్‌రావును ఎన్నికల ప్రచారంలో మంగళవారం స్థానికులు నిలదీశారు. ఉప ఎన్నికల్లో ఇచ్చిన హామీలు, సమస్యలపై యువకులు ప్రశ్నించారు. ఎమ్మెల్యే రఘునందన్‌రావు ప్రచార రథంపై మాట్లాడుతున్న సందర్భంలో.. దళిత యువకులు కొలుపుల దినేష్, ప్రభాకర్ అభ్యంతరం చెప్పారు. 'రుక్మాపూర్‌లో సర్వేనెంబర్ 104, 107లో పోడు భూముల పట్టాలు ఇప్పిస్తానని ఉప ఎన్నికలలో హామీ ఇచ్చారు. అది ఏమైంది' అని ప్రశ్నించారు. అయితే, సహనం కోల్పోఇయన ఎమ్మెల్యే వారిని తన్నుండని నాయకులను పురమాయించారు. దీంతో కొందరు గ్రామస్తులు, బీజేపీ కార్యకర్తలకు మధ్య తోపులాట జరిగింది. పోలీసులు దినేష్‌ను అదుపులోకి తీసుకుని.. ఇరువురినీ చెదరగొట్టారు. హామీలపై ప్రశ్నిస్తే బీజేపీ నాయకులు తనపై దాడి చేశారని యువకుడు దినేష్ ఆవేదన వ్యక్తం చేశారు. తమ గ్రామ చెరువులో పడి ముగ్గురు చనిపోతే ఎమ్మెల్యే కనీసం పరామర్శించడానికి రాలేదని, ఉప ఎన్నికల్లో రుక్మాపూర్ గ్రామానికి వచ్చినప్పుడు పోడు భూములకు తప్పకుండా పట్టాలు ఇప్పిస్తానని హామీ ఇచ్చి తర్వాత ముఖం చాటేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

# ఐదు నెలల్లోనే ఐదు గ్యారంటీలు అమలు

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు: కర్నాటక ప్రభుత్వంపై బీఆర్ఎస్ తప్పుడు ప్రచారం చేస్తున్నదని కర్నాటక మంత్రి దినేష్ గుండురావు విమర్శించారు. అధికారంలోకి వచ్చిన ఐదు నెలల్లోనే ఐదు గ్యారంటీలను అమలు చేశామన్నారు. కాంగ్రెస్ హామీ ఇస్తే అమలు కావాల్సిందేనన్నారు. మంగళవారం హైదరాబాద్ లోని గాంధీభవన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. కర్నాటక రైతుల పేరుతో బీఆర్ఎస్ డ్రామా ఆడుతున్నద న్నారు. కేంద్రంలోని బీజేపీ సర్కారు మద్దతు లేకపోయినా కర్నాటకలో బియ్యం పంపిణీ చేస్తున్నామని చెప్పారు. దేశంలో లక్షల కోట్ల ఆస్తులను ధనికులు, వ్యాపారులు కొల్లగొడుతున్నారని చెప్పారు. విద్యుత్ విషయంలో తెలంగాణ పరిస్థితులకు కర్నాటక పరిస్థితులకు చాలా తేడా ఉందన్నారు. అయినా కర్నాటకలో ఎలాంటి సమస్య లేదన్నారు. బీఆర్ఎస్, బీజేపీ నాయకులకు ఏమైనా అనుమానం ఉంటే కర్నాటక విజిట్ చేసేందుకు స్వాగత్తి స్తామన్నారు. సాధారణ పౌరులకు ఎలాంటి సమస్య లేకుండా కరెంట్ చార్జీలు అమలు చేస్తున్నట్టు తెలిపారు. కాంగ్రెస్ ముక్త భారత్‌ను బీజేపీ కోరుకుంది కానీ కాంగ్రెస్ ఏంటో వివిధ రాష్ట్రాల్లో గెలిచి చూపించామన్నారు. కర్నాటక ఎన్నికల తర్వాత కాంగ్రెస్ వేగంగా పుంజుకు ందన్నారు. అభివృద్ధి నినాదం మీద ఏర్పడ్డ తెలంగాణ కేసీఆర్ కుటుంబం చేతిలో ఉందన్నారు. తెలంగాణ మిగులు నిధులతో ఆర్థికంగా బలమైన రాష్ట్రమన్నారు.

# విశ్వేశ్వరయ్య, విద్యాసాగర్‌రావు మహానుభావులు

## కేంద్ర ప్రభుత్వ హైడ్రో పవర్ ప్రాజెక్టుల పరిష్కారాల శాఖ మాజీ చైర్మెన్ పీబీ చారి




హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

దేశంలో ఇంజినీరింగ్ కమ్యూనిటీకి విస్తృత సేవలు అందించిన మోక్ష గుండం విశ్వేశ్వర్యయ్య, తెలంగాణ వాటర్‌మెన్ విద్యాసాగర్‌రావు మహానుభావు లని కేంద్ర ప్రభుత్వం హైడ్రోపవర్, ఇరిగేషన్ ప్రాజెక్టు పరిష్కారాల శాఖ మాజీ చైర్మెన్ పీబీ చారీ వ్యాఖ్యానించారు. తరతమ స్థాయిల్లో కృషిచేశారని గుర్తు చేశారు. ఇంజినీర్లుగానే కాకుండా పరిపాలకులుగా పేరుగాంచారని చెప్పారు. మంగళవారం హైదరాబాద్‌లోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్ భవనంలో తెలంగాణ ఏడో సాగునీటి దినోత్సవం నిర్వహించారు. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్లు, తెలంగాణ రిటైర్డ్ ఇంజినీర్స్ అసోసియేషన్, సాగునీటి శాఖ, హైదరాబాద్ ఇంజినీర్స్ అసోసియేషన్, తెలంగాణ ఇరిగేషన్ గ్రాడ్యుయేట్స్ ఇంజినీర్స్ అసోసియేషన్ తదితర సంస్థల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమం లో పాల్గొన్న పీబీ చారి మాట్లాడుతూ మోక్షగుండం విశ్వేశ్వరయ్య గురించి రాసిన పుస్తకాలను ప్రతిఒక్క ఇంజినీరు చదవాలని కోరారు. ఇరిగేషన్‌లో హైడ్రాలజీ శాఖ చాలా కఠినంగా ఉంటుందన్నారు. వాతావరణ మార్పుల ప్రభావం ఎన్నో అంశాలపై ఉంటుందన్నారు. ప్రధానంగా నీటిపై అధికంగా పనిచేస్తుందని గుర్తు చేశారు. ఇరిగేషన్ ఇంజినీర్లకు తరచుగా శిక్షణా కార్యక్రమాలు నిర్వహించాలని చెప్పారు. ప్లానింగ్, డిజైన్, బిల్డింగ్, తదితర అంశాల్లో శిక్షణ కచ్చితంగా అవసరమని వివరించారు. మనకు ప్రస్తుతం విజ్ఞానమే లేదనీ, నీళ్ల గురించి ఆలోచిస్తున్నా మన్నారు. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్ కర్నాటక శాఖ చైర్మెన్ (ఎలెక్ట్) ఎం. నాగరాజు మాట్లాడుతూ ప్రభుత్వా లు ఇంజినీర్లను గౌరవించాలని కోరారు. విద్యాసాగర్ రావు పేర అవార్డులు ఇవ్వడం సంతోషమన్నారు. ఈ కార్యక్రమాలకు ముఖ్యమంత్రులను ఆహ్వానించాలని కోరారు. కర్నాటకలో రెండు రోజులపాటు ఇంజినీర్లకు సంబంధించి కార్యక్రమాలను నిర్వహించా మన్నారు. సాంకేతిక పరిజ్ఞానం లేని సమయంలో విశ్వేశ్వరయ్య పనిచేశారని గుర్తు చేశారు.

### 'మోక్షగుండం' పుస్తక అనువాదం

మోక్షగుండం విశ్వేశ్వరయ్య రాసిన ' నావృత్తి జీవితం- అనుభవాలు' పుస్తకాన్ని తెలుగులోకి సీఎం ఓఎస్డీ శ్రీధర్‌రావు దేశ్‌పాండే అనువదించారు. దీన్ని ఎం. నాగరాజు ఆవిష్కరించారు. పుస్తకం గురించి దేశ్‌పాండే వివరించారు. పుస్తకాన్ని ఏ పరిస్థితుల్లో రాయాల్సి వచ్చిందో తెలిపారు.

### పలువురికి విద్యాసాగర్‌రావు అవార్డులు


ఏడో ఇరిగేషన్ డేతోపాటు విద్యాసాగర్‌రావు పుట్టిన రోజు ఉత్సవాల నేపథ్యంలో పలువురు ఇంజినీర్లకు విద్యాసాగర్‌రావు పేర అవార్డులు అంద జేశారు. ఇందులో సాగునీటి శాఖ ఇంజినీర్ ఇన్ చీఫ్(జనరల్) జి. అనిల్ కుమార్, సీఈలు బి. ప్రసాద్, వి. అజరుకుమార్, ఇతర ఇంజినీర్లు జి.శ్రీనివాసరెడ్డి, బి.శైలజ, జి. స్నేహను మెమొంటో, శాలువాతో సత్కరించారు.

# ముఖ్యమంత్రిపై నామినేషన్ల అస్త్రం

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

రాష్ట్రంలోని మొత్తం 119 అసెంబ్లీ నియోజకవర్గాల్లో సోమవారం నామినేషన్ల పరిశీలన అనంతరం 2,898 మంది బరిలో నిలిచారు. ముఖ్యమంత్రి పోటీ చేస్తున్న గజ్వేల్, కామారెడ్డిలతో పాటు మొత్తం 5 నియోజక వర్గాల్లో 50కి పైగా నామినేషన్లు దాఖలయ్యాయి. గజ్వేల్‌లో అత్యధికంగా 114, మేడ్చల్‌లో 67, కామారెడ్డిలో 58, ఎల్‌బీ నగర్‌లో 57, మునుగోడులో 50 నామినేషన్లు దాఖలయ్యాయి. 2018 ఎన్నికల్లో సైతం ముఖ్యమంత్రి పోటీ చేసిన గజ్వేల్‌లో భారీ స్థాయిలో నామినేషన్లు దాఖలు కాగా చివరికి వాటిని విత్‌డ్రా చేయించారు. ఉపసంహరణకు బుధవారం వరకు గడువు ఉండటంతో బుజ్జగింపుల పర్వం కొనసాగుతోంది. ఉపసంహరణ అనంతరం బరిలో నిలిచే వారు ఎంత మంది అనేది వెల్లడికానుంది. ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావు పోటీ చేస్తున్న గజ్వేల్, నియోజక వర్గంలో రాష్ట్రంలోనే అత్యధికంగా 114 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. రంగారెడ్డి జిల్లా వట్టి నాగుల పల్లి, శంకర్ పల్లికి చెందిన ప్లాట్ల బాధితులు అధికంగా ఇక్కడి నుంచి నామినేషన్లు దాఖలు చేశారు. ఎన్నో ఏళ్లుగా తమకు జరిగిన అన్యాయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకు వచ్చినా పరిష్కారం కాక పోవడంతో ముఖ్యమంత్రిపై పోటీ చేసి తమ నిరసనను తెలియ జేసేందుకు వీరు ఎన్నికల రంగంలోకి దిగారు. అలాగే. జగిత్యాల జిల్లాలో మూత పడ్డ ముత్యం పేట చెరుకు ఫ్యాక్టరీని తెరిపిస్తామని బీఆర్ఎస్‌తో పాటు బీజేపీలు గతంలో హామీ ఇచ్చాయి. రెండు సార్లు అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ ముత్యంపేట షుగర్ ఫ్యాక్టరీని తెరిపించడానికి ఎలాంటి ప్రయత్నం చేయలేదు. ప్రతి ఎన్నికల్లో ఈ సమస్య ప్రధాన అంశంగా మారుతోంది. దాంతో చెరుకు రైతులతో పాటు భూ బాధితులు ఎక్కువగా నామినేషన్లు దాఖలు చేశారు. ముఖ్యమంత్రి పోటీ చేస్తున్న మరో నియోజక వర్గమైన కామారెడ్డిలోను గజ్వేల్ పరిస్థితే నెలకొంది. ఇక్కడ తెలంగాణ పీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డితో పాటు మొత్తం 58 మంది నామినేషన్లు దాఖలు చేశారు. ఇక్కడ నిరుద్యోగులు, అమరవీరుల కుటుంబాలకు చెందిన పలువురు సీఎంకు వ్యతిరేకంగా బరిలోకి దిగారు. . టీపీపీఎస్ ద్వారా ఉద్యోగాల భర్తీలో జరుగుతున్న జాప్యంతో నిరుద్యోగులు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. అమర వీరుల కుటుంబాలకు చెందిన పలువురు తమను పట్టించుకోవడం లేదనే ఆగ్రహంతో ఉన్నారు. వీరంతా సర్కారుకు తమ సమస్యలను తెలియ జేసేందుకు నామినేషన్ల అస్త్రాన్ని ఎంచుకున్నారు.

# అవినీతి రాజధాని'గా మధ్యప్రదేశ్ : రాహుల్ గాంధీ



భోపాల్- ప్రభాత సూర్యుడు : మధ్యప్రదేశ్‌లో బీజేపీ ప్రభుత్వం ఆ రాష్ట్రాన్ని 'అవినీతి రాజధాని'గా మార్చివేసిందని కాంగ్రెస్ నాయకులకు రాహుల్ గాంధీ ఆరోపించారు. రాష్ట్రంలోని నీముచ్ జిల్లాలోని జావద్‌లో సోమవారం జరిగిన ఎన్నికల బహిరంగ సభలో రాహుల్ గాంధీ ప్రసంగించారు. బడా పారిశ్రామిక వేత్తలతో కుమ్మక్కయి బీజేపీ ప్రభుత్వం మధ్యప్రదేశ్ ప్రజలను దోచుకుందని విమర్శించారు. ఇటీవల సోషల్ మీడియాలో వైరల్‌గా మారిన కేంద్ర మంత్రి నరేంద్ర సింగ్ తోమర్ కుమారుడి వీడియో గురించి కూడా రాహుల్ గాంధీ ప్రస్తావించారు. ఈ వీడియోలో తోమర్ కుమారుడు మీ డబ్బును దొంగిలిస్తున్నట్లు కనిపించిందని రాహుల్ తెలిపారు. 'మధ్యప్రదేశ్‌లోని బీజేపీ ఎమ్మెల్యేలు, మంత్రులు కూడా తక్కువ కాదు. రైతులు, కార్మికుల నుంచి డబ్బులు దోచుకోవడంలో తోమర్‌తో పోటీ పడుతున్నారు' అని రాహుల్ ఆరోపించారు. అదానీ వంటి పారిశ్రామికవేత్తలకు ప్రయోజనం కలిగించేందుకే నోట్ల రద్దు జరిగిందని, నోట్ల రద్దు చిన్న దుకాణాల యజమానులు, సామాన్య ప్రజలు తీవ్రంగా దెబ్బతీసిందని రాహుల్ తెలిపారు. మధ్యప్రదేశ్‌లో 500 ఫ్యాక్టరీలను స్థాపించామని బిజెపి ప్రభుత్వం 'బహిరంగంగా అబద్ధాలు' అడుతుందని, నీముచ్‌లో అలాంటి ఫ్యాక్టరీని ఒక్కటైనా చూశారా.. అని రాహుల్ ప్రజలను ప్రశ్నించారు. కేంద్రం, రాష్ట్రంలో అధికారంలోకి వస్తే కుల గణన నిర్వహిస్తామని రాహుల్ హామీ ఇచ్చారు. 230 మంది ఎమ్మెల్యేలు ఉన్న మధ్యప్రదేశ్‌లో ఈ నెల 17న అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి.

# భారీ మెజార్టీతో కాంగ్రెస్ గెలవడం ఖాయం : సర్పంచ్ రాజిరెడ్డి




చిన్న శంకరంపేట్ -ప్రభాత సూర్యుడు

అధిష్టానం ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీలతో తెలంగాణ ప్రజలు అన్ని రంగాలలో అభివృద్ధి చెందుతారని మెదక్ గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయమని శంకరంపేట సర్పంచ్ రాజిరెడ్డి అన్నారు. శంకరంపేట లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో భాగీర్తిపల్లి కి చెందిన ఇతర పార్టీలకు చెందిన సుమారు రెండు వందల మంది కార్యకర్తలు సర్పంచ్ రాజిరెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు మైనంపల్లి రోహిత్ రావుకు పూర్తి మద్దతు ఇస్తామని భారీ మెజార్టీతో కాంగ్రెస్ పార్టీని గెలిపించుకుంటామని యాదవ సంఘం వారు అన్నారు. మాజీ ఏఎంసి చైర్మన్ గంగా నరేందర్ ముదిరాజ్, ఉప సర్పంచ్ జీవన్,మేడి మురళి, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## రేపటి నుంచి టెన్త్, ఇంటర్ దూరవిద్య ప్రవేశాలు

**హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు:** తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ (టాస్) ఆధ్వర్యంలో పదో తరగతి, ఇంటర్ ప్రవేశాల కోసం ప్రత్యేక డ్రైవ్‌ను చేపట్టింది. ఈ మేరకు టాస్ డైరెక్టర్ పివి శ్రీహరి మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పదో తరగతి, ఇంటర్‌లో ప్రత్యేక ప్రవేశాల ప్రక్రియ గురువారం నుంచి ప్రారంభమవుతుందని తెలిపారు. వాటిలో చేరేందుకు తుది గడువు ఈనెల 30 వరకు ఉందని పేర్కొన్నారు. విద్యార్థులు ఆన్‌లైన్‌లోనూ చేరేందుకు అవకాశముందని తెలిపారు. ఇతర వివరాల కోసం https://www.telanganaopenschool.org వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

## భారీగా పట్టుబడుతున్న నగదు

**హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు:** ఎన్నికల ప్రవర్తన నియమావళిలో భాగంగా చేపట్టిన తనిఖీల్లో అధికారులు పెద్దమొత్తంలో నగదు, లిక్కర్, మత్తు పదార్థాలు, ఇతర వస్తువు లను స్వాధీనం చేసుకుంటున్నారు. మంగంళవారం రూ. 2,55,38,080 నగదు, రూ.2,59,52,478 కోట్ల విలువ చేసే మద్యం పట్టుబడింది.రూ. 4,44,250 లక్షల విలువ చేసే మత్తు పదార్థాలు, రూ. 37,27,583 విలువ చేసే ఇతర వస్తువులను అధికారులు పట్టుకున్నారు. కాగా మంగళవారం బంగారం, వెండి లాంటి వస్తువులు పట్డబడలేదని అధికారులు తెలిపారు. అక్టోబర్ 9 నుంచి ఇప్పటి వరకు మొత్తం రూ. 571, 80 98,991 కోట్ల విలువ చేసే నగదు, బంగారం, ఇతర వస్తువులను స్వాధీనం చేసుకున్నట్టు అధికారులు తెలిపారు.

## మళ్లీ అధికారంలోకి వస్తే 24 గంటలు నీటి సరఫరా : కేటీఆర్

**హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు:** ఈ దఫా మళ్లీ అధికారంలోకి వస్తే హైదరాబాద్ లో 24 గంటలు నీటి సరఫరా చేస్తామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హామీ ఇచ్చారు. మంగళవారం నగరంలోని ఒక ప్రయివేటు హౌటల్‌లో తెలంగాణ బిల్డర్స్ అసోసియేషన్ సభ్యులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. సుస్థిరమైన ప్రభుత్వం, సమర్ధ నాయకత్వముంటే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందనీ, అది కేసీఆర్‌తోనే సాధ్యమని తెలిపారు. కాంగ్రెస్‌ను గెలిపించిన కర్ణాటక దీపావళి పండుగను అంధకారంలో చేసుకోవాల్సి వచ్చిందని విమర్శించారు. ఆ పార్టీ నీరు, ఉద్యోగాలు, సాంఘిక, ఆర్థిక భద్రత కల్పించడంలో విఫలం కావడంలో కొంత మందిని నక్సలిజం వైపునకు వెళ్లేలా నెట్టిందని తెలిపారు. పీఎం మోడీకి, రాహుల్ గాంధీకి 28 రాష్ట్రాల్లో తెలంగాణ ఒకటని తెలిపారు. వారికి తెలంగాణలో గెలవాలనీ ఉందనీ, కానీ బీఆర్ఎస్‌కు మాత్రం తెలంగాణ గెలవాలని ఉందన్నారు. కాంగ్రెస్ నాయకుల కారణంగానే మూసి నదికి దుస్థితి పట్టిందని దుయ్యబట్టారు. హైదరాబాద్ విస్తరించిందనీ, 330 కిలోమీటర్ల అవుటర్ రింగ్ రోడ్డు భువనగిరి, చౌటుప్పల్, షాద్ నగర్, సంగారెడ్డిలను కలుపనుందని తెలిపారు.

## చట్టసభల్లో కమ్యూనిస్టులుండాలి



**హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు:** కార్మిక వర్గం, పేదల కడుపులు నింపే ఎర్రజెండా కావాలా.. ప్రజలను దోచుకునే బీఅర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ దోపిడీదారులు కావాలా అనేది ప్రజలు ఆలోచించుకొని ఓటేయాలని సీపీఐ(ఎం) జాతీయ నాయకులు సాయిబాబు కోరారు. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు నియోజకవర్గ సీపీఐ(ఎం) ఎమ్మెల్యే అభ్యర్థి మల్లికార్జున్ గెటలుపు కోసం మంగళవారం ఇస్నాపూర్ చౌరస్తాలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కే రాజయ్య అధ్యక్షతన నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. ఆకాశవాద బీఆర్ఎస్, అవినీతి కాంగ్రెస్, మతోన్మాద బీజేపీ అభ్యర్థులను ఓడించాలని పిలుపునిచ్చారు. వీళ్లంతా గడిచిన పదేండ్లలో ఏనాడూ కార్మికులు, శ్రామికులు, పేద ప్రజల కష్టాల గురించి పట్టించుకున్న పాపన పోలేదన్నారు. సీపీఐ(ఎం) మాత్రం కార్మికులు, పేదల పక్షాన నికరంగా నిలబడి పోరాటాలు చేసిందన్నారు. బీఆర్ఎస్ చెబుతున్న అభివృద్ధి మేడిపండు చందంగా ఉందన్నారు. కోటి మంది కార్మికులకు సంబంధించిన కనీస వేతనాల అమలు గురించి బీఆర్ఎస్ ప్రభుత్వం ఏనాడు పట్టించుకోలేదని, దాని వల్ల కార్మిక వర్గం తీవ్రంగా నష్టపోయిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కొత్త పరిశ్రమలు స్థాపించి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించకపోగా ఉన్న పరిశ్రమల్లో కార్మికుల కష్టాలనూ తీర్చేలేదన్నారు. రాష్ట్రంలో ఆర్టీసీ, అంగన్వాడీ, ఆశా, జీపీ, మున్సిపల్ ఇలా అనేక రకాల కార్మికులు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వందకు పైగా సమ్మె పోరాటాలు నిర్వహించినా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. పైగా సమ్మె చేసే వారితో తాను మాట్లాడబోనని, అధికారులు, మంత్రులు చర్చలు కూడా జరపకూడదని చెప్పిన కేసీఆర్‌కు ఎందుకు కార్మికవర్గం ఓటేయాలో చెప్పాలని నిలదీశారు. ప్రజాస్వామ్యాన్ని గౌరవించని నీరో చక్రవర్తి లాంటి కేసీఆర్ నియంతల పాలనను ప్రజలు తిరస్కరించాలని పిలుపునిచ్చారు. బీజేపీ, ఎంఐఎంతో జతకట్టిన బీఆర్ఎస్ జీఎస్టీ బిల్లుకు ఎందుకు మద్దతు ఇచ్చిందని ప్రశ్నించారు. ఆనాడు సీపీఐ(ఎం) మాత్రమే అసెంబ్లీలో జీఎస్టీ బిల్లును వ్యతిరేకించగా, బీఆర్ఎస్ మాత్రం సంపూర్ణ మద్దతు ఇచ్చిందన్నారు. పదేండ్ల తర్వాత ఆర్థిక మంత్రి హరీశ్ రావు కేంద్రం నుంచి నిధులు రావడం లేదంటూ ఓ పెద్ద బిచ్చగాడిలా నిధులివ్వండీ అంటూ అడుక్కుంటున్నారని ఎద్దేవా చేశారు. రహదారులు, ఓడరేవులు, విమానాశ్రయాలు, కేంద్ర ప్రభుత్వ సంస్థలను తెగ నమ్ముతున్న బీజేపీకి వ్యతిరేకంగా బీఆర్ఎస్ ఏనాడు పోరాడింది లేదన్నారు. సీపీఐ(ఎం) మాత్రం బీజేపీ అనుసరిస్తున్న మతోన్మాద విధానాలకు వ్యతిరేకంగా పోరాడుతూనే మోడీ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండ కొడుతూ ఉద్యమించిందన్నారు. పదేండ్లు అధికారం లేని కాంగ్రెస్ ఒక్క అవకాశం ఇవ్వాలని కోరడంలో అంతర్యం ఏమిటని ప్రశ్నించారు.

# సంక్షేమ పథకాలే బీఆర్ఎస్‌ను గెలిపిస్తాయి

## మంత్రి తలసాని శ్రీనివాస్

**హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు**



గడిచిన తొమ్మిదిన్నర సంవత్సరాల చేప ట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలే తిరిగి బీఆర్ఎస్ పార్టీని గెలిపిస్తాయని సనత్‌నగర్ ఎమ్మెల్యే అభ్యర్థి, మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ చెప్పారు. మంగళవారం బేగంపేట డివిజన్‌లోని దేవిడి, తబేలా, వికార్ నగర్, భగ వంతాపూర్ లలో ఇంటింటి ప్రచారం నిర్వహి ంచారు. ప్రచారంలో అడుగడుగునా ఆయనకు ప్రజలు ఘన స్వాగతం పలికారు. మహిళలు మంత్రికి నుదుటన కుంకుమ తిలకం దిద్ది మం గళ హారతులు పట్టారు. ఈ సందర్భంగా ఆయ న మాట్లాడుతూ 2014 కు ముందు ఇక్కడి నుండి గెలిచిన వారు నియోజకవర్గ అభివృద్ధి, ప్రజా సమస్యలను విస్మరించారని, కేవలం ఎన్నికల సమయంలో మాత్రమే ప్రజల వద్దకు వచ్చే వారని, ఎన్నికల అనంతరం అందుబా టు లో ఉండేవారు కాదన్నారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాతనే సనత్‌నగర్ నియోజకవర్గ పరిధిలో అనేక అభివృద్ధి పనులు చేపట్టి ప్రజలు ఎదు ర్కొంటున్న అనేక సమస్యలను పరిష్కరి ంచి నట్లు తెలిపారు. తాను నిరంతరం ప్రజల మధ్య నే ఉంటూ వారి సమస్యలను తెలుసుకొని వారి అవసరాలకు అనుగు ణంగా అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. బేగంపేట డివిజన్‌లో కూడా రోడ్ల అభివృద్ధి, డ్రయినేజీ వ్యవస్థ అభి వృద్ధి, త్రాగునీటి పైప్ లైన్ ల ఏర్పాటు వంటి అభివృద్ధి పనులు చేసినట్లు గుర్తు చేశారు. మంత్రి వెంట కార్పొరేటర్ మహేశ్వరి శ్రీహరి, డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, జనరల్ సెక్రెటరీ ఆరీఫ్, నాయకులు నరేందర్ రావు, శేఖర్, అఖిల్, మోహినోద్దీన్, జావీద్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# బ్రతుకులు మారాలంటే ఇందిరమ్మ రాజ్యం రావాలి





**అబ్దుల్లాపూర్ మెట్ - ప్రభాత సూర్యుడు**

పేదల బ్రతుకులు మారాలంటే ఇందిరమ్మ రాజ్యం రావాలని, తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తేనే అది సాధ్యపడుతుందని ఇబ్రహీంపట్నం నియోజకవర్గం కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి మల్రెడ్డి రంగా రెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలో మల్రెడ్డి రంగారెడ్డి సిపిఐ నాయకులతో ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. కుత్బుల్లాపూర్, గౌరెల్లి, బాచారం, గువ్వలేటి, చిన్నరావిరాల, బండ రావిరాల , సద్దుపల్లి, తారామతిపేట్, బలిజగుడ, కవాడిపల్లి గ్రామాలలో భారీ జనసంద్రోహం నడుమ రోడ్ షోలు నిర్వహించారు. ఈ సందర్భంగా మల్రెడ్డి రంగా రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీ పథకాలను ప్రజలకు వివరిస్తూ నియోజగవర్గం ఏర్పడిన నాటినుండి ఎక్కడ చుసిన అభివృద్ధి కుంటుపండిందని, అవినీతి రాజ్యమేలుతుందని విమర్శించారు. ఈ ఎన్నికల్లో తనను గెలిపిస్తే అభివృద్ధి అంటే ఏమిటో చూపిస్తానని, కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీ హామీలన్నీ నెరవేరుస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు జడ్పీటీసీ బింగి దేవదాస్ గౌడ్, మర్రి నిరంజన్ రెడ్డి, చిలుక మధుసుదన్ రెడ్డి , బుర్ర మహేందర్ గౌడ్, కొత్తపల్లి జైపాల్ రెడ్డి, చెవుల చిరంజీవి, కొత్త ప్రభాకర్ గౌడ్ , భీమగోని భాస్కర్ గౌడ్, ఎం ప్రభాకర్ ముదిరాజ్, మెట్టుపల్లి హరి మోహన్ రెడ్డి, కవాడి శ్రీనివాస్ రెడ్డి, గ్యార భగవాన్ దాస్, సిహెచ్ భాస్కరా చారి, సిపిఐ నాయకులు ఆందోజు రవీంద్ర చారి, ముత్యాల యాదిరెడ్డి, హరిసింగ్ నాయక్వైస్ ఎంపీపీ కోలన్ శ్రీధర్ రెడ్డి, మూల మహేష్ గౌడ్, మూల కిరణ్ గౌడ్, గ్యారాల శ్రీనివాస్ గౌడ్, ఓరుగంటి కొండల్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# వివిధ పార్టీల నుండి కాంగ్రెస్ లోకి చేరిక





**కుత్బుల్లాపూర్- ప్రభాత సూర్యుడు**

తెలంగాణ ప్రభుత్వం అప్పుల లో ముందుంది అని అభివృద్ధిలో వెనుకబడిందని ప్రజలు గమనించారని అందుకే కాంగ్రెస్ పార్టీని భారీ మెజార్టీతో గెలిపించడం ఖాయమని దుందిగల్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పార్టీ అభ్యర్థి కొలను హనుమంత్ రెడ్డి అన్నారు. కాంగ్రెస్ నాయకులు ప్రేమ్ కుమార్ ఆధ్వర్యంలో దుండిగల్ మరియు పరిసర ప్రాంతాలకు చెందిన బిఆర్ఎస్ కార్యకర్తలు సుమారు వెయ్యి మంది మహిళలు యువకులు కొలను హనుమంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. అనంతర యోజకవర్గంలోని 125 డివిజన్ శ్రీనివాస నగర్, జగద్గిరిగుట్టలో కాంగ్రెస్ పార్టీ నాయకులు శ్యామ్ ఆధ్వర్యంలో సుమారు 600 మంది ఇతర పార్టీల నుండి కొలను హనుమంత రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ లో చేరారు. ఈ కార్య క్రమంలో టిపిసిసి రాష్ట్ర నాయకులు సొంటి రెడ్డి పున్నారెడ్డి, నర్సారెడ్డి భూపతిరెడ్డి, పార్టీ నాయకులు కెపి విశాల్ గౌడ్, బొంగునూరి శ్రీనివాస్ రెడ్డి, మైసిగారి శ్రీనివాస్, కుమార్ యాదవ్, సాధు యాదవ్, కిషోర్ రెడ్డి, నవీన్ రెడ్డి, బోయిని వెంకటేష్ ,సంజీవరెడ్డి, శ్రీధర్ వర్మ లతో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు భారీ ఎత్తున పాల్గొన్నారు.



Printed, Published and Owned by CHERUKU UPENDAR, Printed at Akshaya Printers, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, EDITOR CHERUKU UPENDAR, PUBLICATION at HAMSA PUBLICATIONS, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, E-mail: upendrabbk@gmail.com, RNI:TELTEL12215